సాక్షి పల్నాడు

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



ఘంటసాల బయోపిక్ ప్రివ్యూ

బాపట్లటౌన్:బాపట్లలోని సినియా థియేటర్‌లో ఘంటసాల బయోపిక్ ప్రివ్యూ అక్టోబర్‌లో ప్రదర్శించనున్నట్లు దర్శక, నిర్మాత రామారావు తెలిపారు. ప్రివ్యూ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు.



ట్రై సైకిళ్లు పంపిణీ

అద్దంకి: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం 35 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అద్దంకి మునిసిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు.



తల్లికి వెండి కిరీటాలు సమర్పణ

నాదెండ్ల: సాతులూరు రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయానికి యల్లమంద గ్రామానికి చెందిన యర్రమాను ఆంజనేయులు, సత్యవతి దంపతులు వెండి కిరీటాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

కనకదుర్గమ్మ సేవలో జిల్లా జడ్జి సత్యశ్రీ



రెంటచింతల: పల్నాడు ప్రాంతంలో త్రిశక్తి పీఠం (లక్ష్మీదేవి, దుర్గాదేవి, సరస్వతీదేవి)గా విరాజిల్లుతున్న పాలువాయి జంక్షన్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం జిల్లా జడ్జి సత్యశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొని అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయాన్ని అందచేశారు. తొలుత జిల్లా జడ్జికి ఆలయ ప్రధాన ధర్మకర్త ఏచూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ చుండు సాంబశివ శాస్త్రి ఘనంగా స్వాగతం పలికారు. రెంటచింతల వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షులు నాళం పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ వద్ద పర్యాటకుల సందడి



విజయపురిసౌత్: దసరా సెలవులు కావటంతో ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. నాగార్జున సాగర్ డ్యాం 26 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో ఆంధ్ర–తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు సాగర్‌కు చేరుకొని డ్యాం గేట్లు తిలకించిన అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపీ స్టేడియం, శ్రీరంగనాథ స్వామి దేవాలయాలను సందర్శిస్తున్నారు. నూతన బ్రిడ్జి, పాత వంతెన, లాంచీస్టేషన్, కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. మాచర్ల మండలంలోని ఎత్తిపోతల జలపాతాన్నీ వీక్షించారు.

లాంచీస్టేషన్ ఆదాయం రూ.1,30,100

పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండకు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. దీంతో లాంచీస్టేషన్‌కు రూ.1,30,100 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు. కొండను సందర్శించిన పర్యాటకులు బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన శిలాఫలకాలను తిలకించారు. అనంతరం మాచర్ల మండలంలోని అనుపు, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కావడి ఊరేగింపు



పిడుగురాళ్ల: సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కావడి ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో గల నాగుల గుడి దేవస్థానం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆశ్వయూజ శుద్ధ షష్టి సందర్భంగా కావడి ఊరేగింపు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగుల గుడి దేవాలయం నుంచి గంగమ్మ గుడి వరకు కావడి ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సావిత్రి నటనను ఎవరూ భర్తీ చేయలేరు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : మహానటి సావిత్రి ఏ పాత్రలోనైనా అద్భుతంగా నటించి మెప్పించారని ప్రముఖ నటి జయసుధ అన్నారు. కళాదర్బార్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుంటూరులోని నాజ్ సెంటర్‌లో ఉన్న మహానటి సావిత్రి కాంస్య విగ్రహానికి జయసుధ ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రి నటనను, ఆమె స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాదర్బార్ అధ్యక్షులు పొత్తూరి రంగారావు, సభ్యులు బి.చంద్రబాబు, భానుప్రకాష్, వెంకటరత్నం, శివకుమార్, హనుమాన్‌సింగ్, కృష్ణారావు, ధర్మసింగ్, సత్యవాణి, రజని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ దేవి శరన్నవరాత్ర్యుత్సవాలు



మంగళగౌరీదేవి అలంకారంలో బాలచాముండేశ్వరీదేవి



రెంటచింతలలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగిన బతకమ్మ వేడుకల్లో పాల్గొన్న భక్తులు



లంకెలకూరపాడులో శ్రీ మహాచండి అలంకారంలో అమ్మవారు



నరసరావుపేటలో ధనలక్ష్మి అలంకారంలో శారదాంబ అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా శ్రీ దేవి శరన్నవరాత్ర్యుత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో ఆదివారం బాల చాముండేశ్వరి అమ్మవారిని మంగళగౌరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీ చక్రార్చన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. -అమరావతి/రెంటచింతల/ముప్పాళ్ల/నరసరావుపేట ఈస్ట్

కృష్ణమ్మ ఉగ్రరూపం

- ఎగువ నుంచి ఆరు లక్షల క్యూసెక్కులు విడుదల
- గంటగంటకు పెరుగుతున్న వరద
- అప్రమత్తమైన అధికారులు
- ఘాట్‌ల వద్ద పోలీసుల భద్రత
- ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు



అమరేశ్వర ఘాట్ వద్ద వరద ఉధృతి

అమరావతి: కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. కృష్ణానదిపై ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి శనివారం సుమారు ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు విడుదల చేశారు. వరద ఉధృతి గంటగంటకు పెరుగుతుంది. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక అమరేశ్వర ఘాట్‌లో సుమారు 11 అడుగుల మేర నీటిమట్టం పెరిగినట్లు సమాచారం. దీంతో నదీ పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిలోని అమరేశ్వర ఘాట్, ధ్యానబుద్ధ ఘాట్‌లలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కృష్ణానదికి అటు వైపున ఉన్న లంక గ్రామాల ప్రజలను, పశువులు, జీవాలను అవసరమైతే అమరావతి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమరావతి– విజయవాడ రోడ్డులోని పెద మద్దూరు గ్రామం వద్ద వాగు చప్టాపై సుమారు మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు.



తాడువాయి వద్ద నది ఒడ్డున నిలిపి ఉంచిన పడవలు

గిరిజన తండాలకు రాకపోకలు బంద్

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 6,09,916 క్యూసెక్కులు విడుదల చేయడంతో గిరిజన తండాలైన జడపల్లి, కంచుబోడు తండాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రెండు తండాల మధ్యలో ఉన్న కొండకోయ వాగుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో తండాల ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. తండాల నుంచి ఎవ్వరూ ప్రయాణించవద్దంటూ రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు విడుదల కావడంతో కృష్ణానదీ పరివాహక గ్రామాలలో వేసిన పత్తి పంటలు నీట మునిగాయి. కృష్ణానదికి వరద పోటెత్తడంతో నిత్యం నదిపై నుంచి అవతలి ఒడ్డుకు, ఇవతలి ఒడ్డుకు తిరిగే ప్రయాణ సాధనాలు నిలచిపోయాయి. తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ నదీ తీర ప్రాంతంలో ప్రజలు, రైతులను అప్రమత్తం చేశామని చెప్పారు. నదిలోకి ఎవ్వరూ వెళ్లకుండా 24 గంటలు కనిపెట్టుకునే విధంగా షిఫ్ట్ సిస్టంలో వీఆర్వో, వీఆర్యేలను కాపాల ఉంచామని తెలిపారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరద ఉధృతి తగ్గే వరకు నదిపై పడవలు వేస్తే తీవ్రమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోందని, నదిలోకి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అన్నారు.



కంచుబోడు, జడపలి తండాల మధ్య వాగుపై ప్రవహిస్తున్న నీరు

వరద నీటిలో మత్స్యకారుల కాలనీ

- అర్ధరాత్రి ఇళ్లల్లోకి చేరిన వరద నీరు
- పరుగులు తీసిన మత్స్యకారులు

దాచేపల్లి: నాగార్జునసాగర్ నుంచి దిగువకు వరద నీరు విడుదల చేయటంతో దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలోని మత్స్యకారుల కాలనీ వరద నీటిలో చిక్కుకుంది. శనివారం అర్ధరాత్రి నుంచే నదిలో వరద ప్రవాహం పెరగటంతో కాలనీని వరద నీరు చుట్టేసింది. వరద నీరు ఇళ్లల్లోకి చేరుతుండడంతో మత్స్యకారులు ఇళ్లను ఖాళీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. ముందు ఇళ్లలోని మహిళలు, వృద్ధులు, చిన్నారులను రామాపురం గ్రామంలోకి చేర్చారు. ఆ తరువాత ఇళ్లలోని సామాగ్రిని పడవల ద్వారా సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మత్స్యకారులకు చెందిన పడవలు, వలలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మత్స్యకారులకు పునరావస కేంద్రం ఏర్పాటు చేశారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు వరద నీటిలో చిక్కుకున్న మత్స్యకారుల కాలనీని పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు.



మత్స్యకారుల ఇళ్లల్లోకి చేరిన వరద నీరు

నీట మునిగిన పంట పొలాలు

కృష్ణా నదిలో వరద నీటి ప్రవాహం పెరగడంతో నది పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. ప్రధానంగా రామాపురం, పొందుగల, కాట్రపాడు గ్రామాల పరిధిలో పత్తి, మిరప, పూల తోటలు నీట మునిగాయి. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.జగ్గారావు, మండల వ్యవసాయశాఖ అధికారి కె.వెంకటేష్ వరద నీటిలో మునిగిన పంట పొలాలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలు నమోదు చేసి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు చెప్పారు.

ప్రభుత్వ భూమిపై కూటమి నేతల కన్ను

ఈపూరు మండలం ఇనిమెళ్ల గ్రామంలో 20 ఎకరాల భూమిని చదును చేసిన వైనం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వగ్రామంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిపై కూటమి నేతల కన్నుపడింది. సర్వేనెం 504–15లోని ఆ భూమిని దున్ని బత్తాయి, మామిడి మొక్కలు వేసేందుకు సిద్ధమయ్యారు. దీనిపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు పలుమార్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా లెక్క చేయలేదు.

తహసీల్దార్ వివరణ

ఈ విషయమై తహసీల్దార్ నళినిని వివరణ కోరగా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికంగా పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కూటమి నేతలు శుభ్రం చేస్తున్న ప్రభుత్వ భూములు

చతికిల పడిన మార్కెట్ కమిటీలు

- ఫీజు వసూళ్లలో మందగమనం
- జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీల్లో రాబడి అంతంత మాత్రం
- ఈ ఏడాది లక్ష్యం రూ.146.31 కోట్లు..
- ఆగస్టు చివరి నాటికి వసూలైంది రూ.43.12 కోట్లు

కొరిటెపాడు (గుంటూరు వెస్ట్): జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీలు ఫీజు వసూళ్లలో డీలా పడ్డాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జిల్లాలో ఉన్న ఎనిమిది మార్కెట్ కమిటీలు, 15 చెక్ పోస్టుల ద్వారా రూ.146.31 కోట్లు రాబట్టాలని మార్కెటింగ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఆగస్టు నెలాఖరుతో ముగిసిన ఐదు నెలల కాలంలో రూ.43.12 కోట్లు మాత్రమే వసూలైంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ.53.58 కోట్లు వసూలు చేయడం గమనార్హం.

- గుంటూరు మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.115 కోట్లు కాగా, ఆగస్టు నాటికి 29.58 శాతంతో రూ.34.02 కోట్లు సాధించారు.
- తెనాలి మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.7.65 కోట్లు కాగా 35.06 శాతంతో రూ.2.68 కోట్లు వసూలు చేసింది.
- పొన్నూరు మార్కెట్ కమిటీ రూ.8.38 కోట్లు కాగా, 32.66 శాతంతో రూ.2.74 కోట్లు.
- దుగ్గిరాల మార్కెట్ కమిటీ రూ.3.75 కోట్లకు 34.67 శాతంతో రూ.1.30 కోట్లు.
- తాడికొండ మార్కెట్ కమిటీ రూ.2.17 కోట్లకు కేవలం 3.27 శాతంతో రూ.7 లక్షలు.
- మంగళగిరి మార్కెట్ కమిటీ రూ.3.03 కోట్లకు 24.72 శాతంతో రూ.75 లక్షలు.
- ఫిరంగిపురం మార్కెట్ కమిటీ రూ.1.88 కోట్లకు 15.73 శాతంతో రూ.30 లక్షలు.
- ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ రూ.4.45 కోట్లకు 28.41 శాతంతో రూ.1.26 కోట్లు వసూలు చేశాయి.



గుంటూరు మార్కెట్ యార్డు (ఫైల్)

జన చండికా జయహో

- భక్తజనంతో పోటెత్తిన ఇంద్రకీలాద్రి
- ఉదయం 8 గంటలకే కంపార్టుమెంట్లన్నీ ఫుల్
- సర్వ దర్శనానికి మూడు గంటలు

విజయ సిద్ధిని కాంక్షిస్తూ చండీదేవికి పూజలు



నయనానందకరం.. నగరోత్సవంలో పూల పల్లకీపై ఊరేగుతున్న ఆదిదంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శ్రీచండీదేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 3 గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకలకు చెందిన భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దసరా ఉత్సవాలలో ఎంతో విశేషమైన చండీదేవి అలంకారం కావడంతో అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆదివారం నుంచి అన్ని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. రూ.300, రూ.100 టికెట్ క్యూలైన్‌లోకి సైతం భక్తులను ఉచితంగా అనుమతించారు. దీంతో ఐదు క్యూలైన్లలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీయాగానికి ఉభయదాతల నుంచి డిమాండ్ ఎక్కువగా కనిపించింది.

తెల్లవారుజాము నుంచే రద్దీ..

తెల్లవారుజాము దర్శనం ప్రారంభమైన కొద్దిసేపటికే ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వరకు భక్తులు బారులు తీరి ఉండగా, తెల్లవారుజామున ఆరు గంటలకే వినాయకుడి గుడి వరకు క్యూలైన్లు రద్దీ పెరిగిపోయింది. ఉదయం 8 గంటలకు సీతమ్మ వారి పాదాలు, 9 గంటలకు వీఎంసీ కార్యాలయం సమీపంలోని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. గంట గంటకూ భక్తుల రద్దీ పెరుగుతూ ఉండటంతో అటు పోలీస్ కమిషనర్, కలెక్టర్, దుర్గగుడి ఈవోలు అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరాల ద్వారా భక్తుల రద్దీని అంచనా వేస్తూ వారికి త్వరత్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. వినాయకుడి గుడి నుంచి కొండపైన ఆలయానికి చేరుకునేందుకు మూడు గంటల సమయం పట్టిందని భక్తులు పేర్కొన్నారు. వీఐపీ టైం స్లాట్ మినహా మిగిలిన సమయంలో ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి భక్తులెవరినీ దర్శనానికి అనుమతించలేదు. అయితే సేవా బృంద సభ్యులు, పలు ప్రభుత్వ శాఖల అధికారుల సిఫార్సులతో కొండపైకి చేరుకుంటున్న భక్తులు లక్ష్మీగణపతి ప్రాంగణం, గాలిగోపురం వద్ద గుంపులు గుంపులుగా చేరి దర్శనానికి పంపాలనడంతో భక్తులు, పోలీసుల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి.

కానుకగా రూ. 10లక్షల బంగారు ఆభరణాలు..

మహారాష్ట్రకు కోల్హాపూర్ ఎంపీ శ్రీకాంత్ షిండే రూ.3.5లక్షల విలువైన బంగారు హారం, హైదరాబాద్‌కు చెందిన సీఎం రాజేష్, ప్రకృతి దంపతులు రూ.6.5లక్షల విలువైన బంగారపు పట్టీలను ఈవో శీనానాయక్‌కు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. గొల్లపూడికి చెందిన శ్రీమంజూష అమ్మవారి ఉచిత ప్రసాద వితరణకు రూ. లక్ష విరాళాన్ని అందించారు.

దుర్గమ్మ సేవలో సీఎస్ విజయానంద్..

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చండీదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకున్నారు. విజయానంద్‌కు దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.



ఆదివారం ఉదయం కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

సెపక్ తక్రాలో జోత్స్న ప్రతిభ



చెరుకుపల్లి: జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు తుమ్మ వెంకట జోత్స్న ఎంపికైనట్లు ఎంఈఓ పులి లాజర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 27, 28 తేదీలలో డాక్టర్ పి. ఆనంద్ మినీ స్టేడియంలో నిర్వహించిన ఏపీ సీనియర్ సెపక్ తకరా చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచి అక్టోబర్‌లో గోవాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. మండలంలోని పొన్నపల్లి గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు తుమ్మ శ్రీనివాసరెడ్డి కుమార్తె. క్రీడాకారిణి జోత్స్నను ఉపాధ్యాయులు మాదావత్ సాంబయ్య నాయక్, ఈమని సాంబశివరావు, రమేష్, కిరణ్ అభినందించారు.

దసరా సెలవుల్లో పిల్లలపై నిఘా ఉంచాలి

బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్లటౌన్: దసరా సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. వర్షాలకు చెరువులు, గుంతలు నిండిపోయి, నదులు, వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సెలవుల్లో సరదాగా కాలక్షేపం కోసం పిల్లలు, యువకులు చెరువులు, కాలువలు, వాగులు, నదీ తీరాలు, సముద్రతీరాలకు వెళ్లి ఈతకు దిగే ప్రయత్నాలు చేస్తున్నారని హెచ్చరించారు. ముఖ్యంగా సూర్యలంక, వాడరేవు, రామాపురం వంటి సముద్రతీరాలకు యాత్రికులు భారీగా తరలివస్తున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. యాత్రికులు తప్పనిసరిగా పోలీసు సూచనలు పాటించాలన్నారు. ఎరుపు రంగు జెండాలను దాటి లోతు ప్రాంతాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదన్నారు.

ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి



బాపట్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం దసరా కానుకగానైనా డీఏ ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ 2024 నుంచి ఇప్పటి వరకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీఆర్సీ బకాయిలు, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్ లోన్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్స్ బకాయిలు దాదాపు రూ.25 వేల కోట్లు ఉన్నాయని చెప్పారు. ఆ బకాయిల విడుదలకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అసెంబ్లీ సమావేశాల చివరి రోజు ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలకు పింఛన్లు, వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని అసెంబ్లీ కమిటీ సిఫార్సు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం, వైద్య సదుపాయాలు కల్పించమంటే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగాలేదని కుంటి సాకులు చెప్పడం సరికాదన్నారు. డీఎస్సీ నియామకాల ద్వారా కొత్త ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తున్నందున ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్నాథ్ పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త!

- ఏడాదిలో పండుగల సమయంలో 30 శాతం దొంగతనాలు
- అప్రమత్తంగా లేకపోతే ఊడ్చేస్తారు
- జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు

సత్తెనపల్లి: జిల్లాలో దసరా పర్వదినం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలకు పది రోజులు సెలవులు వచ్చాయి. ఈ నేపథ్యంలో సెలవులకు ఇంట్లో అందరూ విహార యాత్రలు, బంధువుల ఇళ్లు, స్వస్థలాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలు సందర్శించడానికి సిద్ధమవుతారు. ఆ సమయంలో కొందరు ఇంటి భద్రత విషయమై ఆలోచన చేయరు. సాధారణ రోజులతో పోలిస్తే దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఏడాదిలో జరిగే దొంగతనాల్లో 30 శాతం ఈ సమయాల్లోనే చోటు చేసుకుంటున్నాయని ప్రాథమిక అంచనా. దసరా సెలవుల నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

పోలీసుల సూచనలు ఇవే..

- సెలవులకు ఇంటికి తాళాలు వేసి వెళ్లేవారు ఇంట్లో పెద్ద మొత్తంలో డబ్బు, విలువైన ఆభరణాలు ఉంచి వెళ్లకూడదు.



సత్తెనపల్లిలో ఓ ఇంట్లో ఇటీవల చోరీ జరిగిన దృశ్యం

- ఇళ్ల పరిసర ప్రాంతాల్లో అనుమానంగా సంచరించే వారి గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలి.
- తాళం వేసిన ఇళ్ల వద్ద అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ తచ్చాడుతున్నట్లు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి
- విలువైన వస్తువులు పక్కింటి వారికి ఇచ్చి నమ్మి మోసపోవద్దు. ఇరుగు పొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిది.
- వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకొని వచ్చేలా చూసుకోవాలి.
- ఖరీదైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో పెట్టుకుంటే మంచిది.
- పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- ఇంట్లో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లేటప్పుడు ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధుల వద్దకు అపరిచితుల సమాచారం కావాలని వస్తే నమ్మవద్దు. ఏమరపాటుగా ఉండవద్దు.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- బయటకు వెళ్లేటప్పుడు తాళాలను ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలి.
- గ్రామాలకు వెళ్లేవారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి
- లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకొని తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు చెక్ పెట్టొచ్చు.

'క్లైసా' జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీకాంత్

నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు

నరసరావుపేట: కాన్ఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డు ఇంజినీర్స్, సర్వేయర్స్, అండ్ ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఏపీ (క్లైసా–ఏపీ) పల్నాడు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో క్లైసా ఏపీ అధ్వర్యంలో నిర్వహించిన పల్నాడు చాప్టర్ నూతన కమిటీ ఆవిష్కరణకు గౌరవ చైర్మన్ వేల్పుల రాము, చైర్మన్ ముని శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ కొమ్మసాని కమలాకరరెడ్డి, జనరల్ సెక్రటరీ ఎస్.ఎస్.వి.ఎస్.ఎస్.మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రేజేటి సతీష్‌కుమార్ ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. వీరి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా గౌరవ చైర్మన్‌గా కె.కమలాకరరెడ్డి, చైర్మన్‌గా ఎం.మురళీకృష్ణ, ప్రెసిడెంట్‌గా ఎస్.లక్ష్మీకాంత్, కోశాధికారిగా డి.రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మీసా శ్రీనివాసరావు, బి.నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా డేవిడ్ కృపానందం, సంయుక్త కార్యదర్శులుగా మార్లెళ్ల రామాంజనేయులు, తోట సాంబశివరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.వెంకటనారాయణరావు, ఈసీ సభ్యులుగా పి.నిర్మల్‌కుమార్, డీవీ కృష్ణారావు, పి.శ్యాంప్రసాద్, వి.శ్రీనివాసరావు, నుసి నాగఫణింద్రారెడ్డి, పి.కోటిరెడ్డి, అమర్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు సిరివేరి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ సంఘం సంక్షేమం, టెక్నికల్ సెమినార్లు, సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని హామీ ఇచ్చారు. చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, దాచేపల్లి ప్రాంతాల ఇంజినీర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో శ్రీకారం చుట్టారు. మ్యాక్స్ విజన్ కంటి హాస్పిటల్ డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇంజినీర్స్ వృత్తిలో ఎదురవుతున్న పలు సమస్యలపై చర్చించారు.



నూతన అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

విద్య, వైద్యాన్ని అమ్మకానికి పెట్టిన ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్
- రేపు ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన

మాచర్ల: రాష్ట్రవ్యాప్తంగా విద్య, వైద్యాన్ని ప్రైవేటీకరణ చేసి బడుగు, బలహీన వర్గాలను రోడ్డు మీద పడవేసే కూటమి ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 30న నర్సరావుపేటలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లావ్యాప్త నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పేదలు, చదువుకోవటమే నేరమన్నట్లు విద్య, వైద్యం అమ్ముకోవటానికి సిద్ధమైన విధానానికి వ్యతిరేకంగా మాజీ సీఎం వైఎస్ జగన్ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. ఏడు నియోజకవర్గాల ఎస్సీ కార్యకర్తలు, నాయకులు నర్సరావుపేటలోని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి కార్యాలయం నుంచి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ర్యాలీ నిర్వహించి, అనంతరం నిరసన కార్యక్రమం జరుపుతామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎస్సీ సెల్ జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా సంఘాల వారు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి మాచర్ల సుందరరావు, నియోజక వర్గ నాయకులు బొంగురు, మందా సంతోష్, వేల్పుల గురవయ్య, యేరువ కాశయ్య, డి.కిరణ్ కుమార్, చిన్ని, నక్కా నాగేశ్వరరావు, బూదాల మరియమ్మ, కంభంపాడు విజయ్, భాస్కర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన కుటుంబం

- తొలుత భర్త, నేడు భార్య నేత్రదానం
- కుమారుడు, కుమార్తె కూడా నేత్రదానం చేసేందుకు అంగీకారం




నేత్రదానం చేసిన నాగేంద్రం(ఫైల్)

కారంచేడు: తాను చనిపోయిన తరువాత మరొకరికి చూపునివ్వాలని గ్రామానికి చెందిన యార్లగడ్డ బుల్లెయ్య నిర్ణయించుకున్నారు. ఆయన ఆగస్టు 29వ తేదీన మృతి చెందాడు. అప్పుడు ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. కాగా ఆయన భార్య యార్లగడ్డ నాగేంద్రం (80) ఆదివారం ఉదయం మృతి చెందగా ఆమె కూడా భర్త అడుగుజాడల్లో నిలిచి నేత్రాలను దానం చేయగా.. పెదకాకానిలోని శంకర నేత్రాలయం వారు ఆదివారం నేత్రాలను సేకరించారు. కాగా తమ తల్లి కోరిక ప్రకారం కుమారుడు వెంకటేశ్వర్లు, కుమార్తె అనంతలక్ష్మి కూడా నేత్రాలను దానం చేయడానికి అంగీకరించడం విశేషం.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

మళ్లీ ఆ ఇద్దరే అధ్యక్ష పదవికి పోటీ



ఐసీసీ గుర్తు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఎన్నికల పోటీ రసవత్తరంగా మారింది. ఎన్నడూ లేని విధంగా గతేడాది నుంచే ఐసీసీలో ఎన్నికల ప్రక్రియకు కూటమి ప్రభుత్వం తెరలేపింది. దీంతో అధ్యక్ష పదవి కోసం ఇరువర్గాల ప్యానెళ్లు బరిలోకి దిగాయి. నువ్వా–నేనా అనే రీతిలో పోటీ పడుతున్నాయి.

- గతంలో అధ్యక్షునిగా ఆతుకూరి ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వచ్చారు. దాదాపు 34 ఏళ్ల పాటు ఆయన చాంబర్ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. చాలాసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉన్న రికార్డులను చెరిపేశారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోటీ చిచ్చు రేపింది. దీంతో గతేడాది అధ్యక్ష పదవికి టీడీపీ నేతలు ఏల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణలు పోటీపడ్డారు. చివరకు కూటమి నేతలంతా ఒక్కటై, ఏల్చూరి వెంకటేశ్వర్లకు మద్దతుగా శిబిరాలు నిర్వహించి, అధ్యక్ష బరిలో ఉన్న టీడీపీ నేత బాలకృష్ణను ఓడించారు.
- ఆది నుంచి చాంబర్‌లో చురుగ్గా ఉంటున్న రంగా బాలకృష్ణను విస్మరించి, ఏల్చూరి వెంకటేశ్వర్లు వైపు కూటమి నాయకులు మొగ్గు చూపడం అప్పట్లో పెద్ద దుమారమే రేపింది.
- ప్రస్తుతం జరిగే ఎన్నికల్లోనూ ఆ ఇద్దరి మధ్యనే మళ్లీ పోటీ నెలకొనడం రసకందాయంగా మారింది. ఈసారైనా గెలుపొందాలని బాలకృష్ణ ప్యానెల్ తీవ్రంగా పావులు కదుపుతోంది. అలాగే రెండోసారి కూడా అధ్యక్ష పదవిని కైవసం చేసుకోవాలని ఏల్చూరి వెంకటేశ్వర్లు ప్యానెల్ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది.

గుంటూరు నగరంలోని జిన్నాటవర్ కూడలిలో ఉన్న ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎన్నికలు జరుగుతాయి. సుమారు 3,200 మంది వ్యాపారులకు సభ్యత్వం ఉన్నట్లు కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. ఉదయం పది గంటలకు మొదలయ్యే ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటలతో ముగియనుంది. అదే రోజు రాత్రి ఓట్ల లెక్కింపు నిర్వహించి గెలుపొందిన అభ్యర్థిని ప్రకటిస్తారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న ఆటో : వృద్ధుడు మృతి

ఒకరికి తీవ్ర, నలుగురికి స్వల్పగాయాలు



సంఘటనా స్థలంలో ఉన్న ఆటో

ఫిరంగిపురం: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తి మృతిచెందగా.. మరో ఐదుగురికి గాయాలైన ఘటన శనివారం అర్ధరాత్రి ఫిరంగిపురం శివారులో గుంటూరు – కర్నూలు రాష్ట్ర రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేరికపూడి గ్రామానికి చెందిన ఆరుగురు భక్తులు ఆమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారి దేవాలయంలో భజన కార్యక్రమానికి వెళ్లి.. ఆటోలో తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో ఫిరంగిపురం శివారులోని ఓ హోటల్ ముందు ఆగిఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. దీంతో దానిలో ప్రయాణిస్తున్న ఆర్.రామకృష్ణనాయక్(68) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కె.నాగేశ్వరమ్మకు తీవ్రగాయాలు కాగా డి.ధనలక్ష్మి, జి.అంజమ్మ, జి.లక్ష్మి, కె.వెంకట సుబ్బారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నరసరావుపేట గవర్నమెంటు వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరంతర అభ్యాసంతో విజయాలు సొంతం

చేబ్రోలు: చెస్ ఆటలో మనం గడిపే ప్రతి క్షణం విలువైనదేనని ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో '62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు' ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇండియన్ చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపితో విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ ముందుగా ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోనేరు హంపి మాట్లాడుతూ చెస్ క్రీడాకారులందరికీ ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఒక గొప్ప వేదికన్నారు. నిరంతర అభ్యాసం, పట్టుదలతో ముందుకు సాగినప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు.

ఏడవ రౌండ్ ఫలితాలు..

జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో ఏడో రౌండ్ ముగిసే సరికి, తొలి ఆరు బోర్డులలో నిర్ణయాత్మక ఫలితాలు రాకపోవడంతో ఆధిక్యంలో మార్పు లేకుండా నిలిచింది. ఇప్పటివరకు 6 పాయింట్లు సాధించిన పీఎస్‌పీబీకి చెందిన గ్రాండ్‌మాస్టర్స్ శశికిరణ్, అభిజిత్ గుప్తా, రైల్వేస్ ఐఎం అరోన్యక్ ఘోష్, ఐఎం ఎలెక్ట్ అజయ్ సంతోష్ పర్వతరెడ్డిలు లీడ్‌ను కొనసాగించారు. వీరితో పాటు విజయాలు సాధించిన పీఎస్‌పీబీకి చెందిన జీఎం దీప్ సేంగుప్తా, రైల్వేస్ ఐఎం ఆయుష్ శర్మ, తమిళనాడుకు చెందిన ఐఎం హర్ష సురేష్ కూడా 6 పాయింట్ల క్లబ్‌లో చేరారు.



మాట్లాడుతున్న గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి

రంగస్థలంపై మరో 'చింతామణి'

ఆకట్టుకున్న 'వీణా అవార్డ్స్' ప్రదర్శనలు

తెనాలి: సుదీర్ఘరాగం.. హోరెత్తే సంగీతం.. అర్థం కాని పద్యం... తెలుగువారికే సొంతమైన పద్యనాటకంపై సాధారణ ప్రేక్షకుడి అభిప్రాయం. ఒకప్పుడు పామరులను సైతం ఉర్రూతలూగించిన పద్యనాటకం, రానురాను ఆదరణ కోల్పోతుండటానికి ఇదే కారణం. భాష, భావం అర్థంకాని పద్యగానంపై మక్కువ తగ్గిపోయింది. ఇలాంటి తరుణంలో తెనాలిలో జరుగుతున్న వీణా అవార్డ్స్ నాటకోత్సవాల్లో రెండోరోజైన ఆదివారం ప్రదర్శించిన 'కస్తూరి తిలకం' పద్యనాటకం ఆద్యంతం ప్రేక్షకులను కూర్చోబెట్టింది. కల్పిత కథో, చారిత్రక ఆధారాలున్నాయో తెలీదుగాని, బిల్వమంగళుడు, చింతామణి పేర్లతో ప్రధాన పాత్రల చుట్టూ శారదా ప్రసన్న అల్లిన నాటకాన్ని చందాల కేశవదాసు కళారిషత్, మధిర వారు ప్రదర్శించారు. రంగస్థల కళలో ఆరితేరిన డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు దర్శకత్వం వహించారు. పాత్రల మధ్య సంభాషణలు సందర్భోచితంగా వచ్చే పద్యాలు స్పష్టంగా వినిపిస్తూ, హృద్యమైన గానాలాపనతో నాటకం నడిచింది. చాలాకాలానికి ప్రేక్షకులు చక్కటి పద్యనాటకాన్ని ఆస్వాదించారు. ప్రధాన పాత్రల్లో చిలువేరు శాంతయ్య, బి.విజయరాణి నటించారు. ఇతర పాత్రల్లో సరిత, జి.శివకుమారి, ఎస్.సాంబశివారెడ్డి, నిభానుపూడి సుబ్బరాజు నటించారు. సంగీతం సీహెచ్ నాగేశ్వరరావు.

- తదుపరి మిర్యాలగూడ సాంస్కృతిక సమాఖ్య, మిర్యాలగూడవారి 'బ్రహ్మరథం' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. బ్రహ్మహత్యాపాతకానికి భయపడి ఇంద్రుడు అజ్ఞాతంలో ఉన్నప్పుడు ఇంద్రపీఠం ఎక్కిన నహుషుడుకు పదవీ వ్యామోహంతో చేసిన అరాచకాలకు శాపానికి గురై, పశ్చాత్తాపానికి లోనైన ఇతివృత్తమిది. సూలూరి శివసుబ్రహ్మణ్యం రచనకు తడికమళ్ల రామచంద్రరావు దర్శకత్వం వహించారు. తదుపరి కళాంజలి, హైదరాబాద్ వారి 'యాగం' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీశైలమూర్తి రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. చివరగా హర్ష క్రియేషన్స్, విజయవాడ వారి 'భువి కోరని భ్రమణం' సాంఘిక నాటికను ప్రదర్శించారు. ఆచళ్ల ఉమామహేష్ మూలకథకు తాళాబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరించగా, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించారు. కళల కాణాచి, తెనాలి, ఆర్ఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.



'కస్తూరి తిలకం' పద్యనాటకంలోని ఓ సన్నివేశం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు



దుర్గి గ్రామ శివారులో మృతిచెందిన రాయపాటి ఆనంద్



దుర్గి మిర్చియార్డు వద్ద మృతి చెందిన కొమరగిరి ఆదినారాయణ

మాచర్ల రూరల్: దుర్గి మండలంలో వేర్వేరు చోట్ల ద్విచక్ర వాహనాల పై ప్రయాణిస్తున్న ఇరువురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. దుర్గి మండలంలోని శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకొని ద్విచక్ర వాహనంపై రాయపాటి ఆనంద్ (15) తిరిగి దుర్గి వస్తుండగా ట్రాక్టర్‌ను దాటేందుకు ప్రయత్నించగా ట్రాక్టర్ ట్రక్కు వెనుక భాగం ఢీ కొనటంతో రోడ్డు పై పడి తలకు తీవ్ర గాయమైంది. దీంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. గాయపడిన ఆనంద్‌ను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు.

దుర్గి మిర్చియార్డు వద్ద..

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని దుర్గి మిర్చియార్డు వద్ద చోటుచేసుకుంది. ఆత్మకూరు గ్రామంలోని నర్సరీలో పనిచేస్తున్న కొమరగిరి ఆదినారాయణ (45) మరొక వ్యక్తి ద్విచక్ర వాహనం పై మాచర్లకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న కొమరగిరి ఆదినారాయణ తలకు తీవ్రంగా గాయమై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. వెనుక కూర్చున్న బోసురాజు కొండకు తీవ్ర గాయాలు కాగా మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఆదినారాయణ మేడికొండూరు మండలం, సిరిపురం గ్రామానికి చెందినవాడు. ఈ మేరకు ఎస్ఐ సుధీర్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్టు కొమ్మలు నరుకుతూ విద్యుత్ షాక్‌తో మృతి



వెంకటకోటయ్య మృత దేహం

కారెంపూడి: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందిన ఘటన కారెంపూడిలో ఆదివారం జరిగింది. ఓ ఇంట్లో చెట్టు కొమ్మలు తొలగించే కూలి పనికి వెళ్లి చెరుకూరి వెంకట కోటయ్య (33) చెట్టు కొమ్మలు తొలగిస్తున్న క్రమంలో ఒక కొమ్మ 11 కేవీ విద్యుత్తు లైన్‌పై పడడంతో తీగ తెగి మీదపడి మృత్యువాత పడ్డాడు. వెంకట కోటయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనతో ఇందిరానగర్ కాలనీలో విషాదం అలుముకుంది.